క్లుప్తంగా

వంట పాత్రల పంపిణీ

బొబ్బిలి: మండలంలోని కలువరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరు ముద్ద పథకం నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన వంటపాత్రలను సర్పంచ్ బొత్స నటరాజ్ బుధవారం అందజేశారు. వంటపాత్రలను సక్రమంగా వాడుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వండి పెట్టాలని సూచించారు.

పెన్షనర్ల సంక్షేమానికి కృషి

బొబ్బిలి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు అన్నారు. స్థానిక చిన్నారావు తోటలో బుధవారం విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లతో కార్తీక సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలు, వాటి పరిష్కారం, లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ వంటి అంశాలపై చర్చించారు.

రాగిపంటకు మద్దతు ధర

వంగర: రాగిపంట(చోడిపంట)కు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని ఏఓ టి.కన్నబాబు తెలిపారు. క్వింటాకు రూ.3846లు చెల్లించి రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని వీవీఆర్‌పేట, జేకేగుమ్మడ గ్రామాల రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందని, అందులో భాగంగా రాగి పంట సాగుచేసే రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలు అందిచనున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేలలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా రథయాత్ర

రాజాం: స్థానిక వాసవి క్లబ్, మన రాజాం సారధి, వనితా కాంతి కిట్టి ఆధ్వర్యంలో వేంకటేశ్వర వైభవ రథయాత్ర బుధవారం నిర్వహించారు. అంతకాపల్లి గ్రామం వద్ద టీటీడీ బాలాజీ టెంపుల్ నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. చిన్నారుల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు మధ్య యాత్ర వైభవంగా సాగింది.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

బొబ్బిలి: కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, పాత లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈపీడీసీఎల్ ఈఈ ఎ.అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, కలువరాయి, బలిజిపేట, గొల్లపల్లి, పిరిడి, వంతరాం, జగన్నాథపురం, పెంట, పినపెంకి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

బొబ్బిలి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో అండర్-14 విభాగంలో పారాది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్ఎం నాగేశ్వరరావు, పీడీ ఎస్.వెంకటనాయుడు, సిబ్బంది వారిని అభినందించారు.

నియామక పత్రాలు అందజేత

మెంటాడ: మండలంలో పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయాలని, ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, మండల నాయకులు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణమస్తు చెక్కుల పంపిణీ

రేగిడి: మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ కళ్యాణమస్తు చెక్కులను ఎంపీపీ దార అప్పలనరసమ్మ బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కోడిశకు చెందిన గంగురమ్యకు, మజ్జి రాముడుపేటకు చెందిన నెలిరోతు రజనీలకు ఈ పథకం ద్వారా రూ.50 వేలు చొప్పున మంజూరైనట్లు చెప్పారు. నిరుపేద యువతుల వివాహానికి ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సంకిలి ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, వైకేపీ ఏసీ చిరంజీవి, ఏపీఎం పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి సాయం

బొబ్బిలి: స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాలలో 1987-88 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆపదలో ఉన్న తమ సహ విద్యార్థి చోడిగంజి శ్రీనివాసరావుకు సాయం అందించి స్నేహభావాన్ని చాటుకున్నారు. శ్రీనివాసరావుకు ఆరోగ్యం బాగులేక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు నెలకు సరిపడా నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించారు.

డ్రైనేజీ లీకులతో ట్రాఫిక్ ఇక్కట్లు

రాజాం: ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా పాలకొండ రోడ్డులో చేపడుతున్న పనులకు అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఈ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా మారుతీనగర్ వద్ద లెట్రిన్ రూమ్‌ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇవి లీకులకు గురై రోడ్డుమీదకు నీరు వచ్చి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మున్సిపల్ ఏఈ వెంకట్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు, ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు బుధవారం లీకులను పరిశీలించి, తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.

బొబ్బిలి సత్తా చాటుదాం..

- సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: బొబ్బిలిలో కళాభారతి ఆడిటోరియ కూడలి వద్ద గురువారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయడం ద్వారా పార్టీ సత్తాచాటుదామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రెస్‌మీట్ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. సామాజిక బస్సుయాత్రకు జనసమీకరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా జరిగిన మేలును ప్రజలకు వివరించేందుకే సామాజిక బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో ఉప ముఖ్యమంత్రులు ధర్మాన ప్రసాదరావు, బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, జిల్లా ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో జరిగిన బస్సు యాత్రకు వచ్చిన జన సునామీని చూసి టీడీపీ నాయకులు భయపడుతున్నారని, ఇప్పుడు బొబ్బిలిలో జరిగే బస్సుయాత్రకు వచ్చిన ప్రజలను చూసి టీడీపీ నాయకులు బెంబేలెత్తేలా అన్ని వర్గాల వారు తరలిరావాలని పిలుపునిచ్చారు. యాత్రను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. రామభద్రపురంలో ప్రెస్‌మీట్ అనంతరం బైక్ ర్యాలీ, బస్సులతో బొబ్బిలి బయలుదేరి వెళ్లనున్నట్లు చెప్పారు. బస్సుయాత్రపై గ్రామాలలో ప్రచారం చేసి పెద్ద ఎత్తున ప్రజలు బయలుదేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశుఖర్ పాల్గొన్నారు.

● బాడంగి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బొబ్బిలిలో గురువారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు కోరారు. ఎంపీపీ చాంబర్‌లో బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారంతా ఈ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో బుధవారం ఆరు కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంబంగి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 18వ వార్డుకు చెందిన కె.సూరిబాబు ఆధ్వర్యంలో బూడి ఆనందరావు, బూడి భారతి, బూడి రాజా, పద్మ, నర్సింగ్‌రావు, నీలిమ తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, యువనాయకులు శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, పలు వార్డుల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన ట్రాఫిక్ సమస్య

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలుచోట్ల లైనింగ్ చేసిన ప్రాంతాల్లో భారీ వాహనాలు దిగబడుతున్నాయి. పారధి వంతెన మీదుగా రాకపోకలు నిలిచిపోవడంతో రాయఘడ వెళ్లే భారీ లారీలు ఈ రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఓవర్‌లోడుతో వెళ్తున్న రెండు లారీలు మారుతీనగర్ సమీపంలో బుధవారం రోడ్డు పక్కన దిగబడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు వెంటనే మున్సిపల్, ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులతో సమీక్షించారు. దిగబడిన లారీలను రెండు క్రేన్‌ల సాయంతో తొలగించే ఏర్పాటుచేశారు. లారీలు బయటకు వచ్చిన అనంతరం పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఎమ్మెల్యే చొరవను పట్టణవాసులు అభినందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రాజాం: సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకల్లో భాగంగా పట్టణంలో మెంటిపేట సుందరం సత్యసాయి మందిరంలో బుధవారం 225 మంది పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం విశేష పూజలు, నగర సంకీర్తన కార్యక్రమం, సత్యసాయి అఖండనామ భజన నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ ముప్పిడి శ్రీనివాసరావు, మానం వెంకటేశ్వరరావు, గోవిందరావు, రాజు, శివరామకృష్ణ మాస్టారు, అద్దంకి వాసు, సూర్యారావు, ఉమ, శారద, జ్యోతి, రమ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ నాయుడు, హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని రేగిడి గ్రామంలో బుధవారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు, చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించినట్లయితే మనస్సుకు సంతృప్తినిస్తుందన్నారు. సామాజిక సేవే మాధవ సేవ అని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు.

విద్యతోనే సంస్కారం

రాజాం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవాలని, అప్పుడే అందులోని పరమార్థం తెలుస్తుందని సత్యసాయి సేవాదళ జిల్లా ఐటీ ఇన్‌చార్జ్ హైమావతి అన్నారు. రాజాం పట్టణంలో సత్యం సత్యసాయి మందిరంలో బుధవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉన్నత చదువులతో సంస్కారం లభిస్తుంది, ఉత్తమ జీవన పద్ధతులు అలవడ్తాయని, మంచి చెడుల తేడా తెలుస్తుందని అన్నారు. అనంతరం హైమావతిని కమిటీ సభ్యులు సత్కరించారు.

నూతన బోధనా పద్ధతులపై శిక్షణ

సంతకవిటి: సంతకవిటి, రాజాం మండలాలలోని 6,7,8 తరగతులకు బోధించే 50 మంది భాషోపాధ్యాయులకు గుళ్లసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురు, శుక్రవారం భాషేతర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుదని ఎంఈఓ బి.శాంతికుమారి తెలిపారు. ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా అదపాక దామోదరరావు, కె.శ్రీనివాసరావులు వ్యవహరించారు.

ఓటరు నమోదుపై అవగాహన

బొబ్బిలి: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు కోరారు. పట్టణంలోని వాసు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓటుహక్కు నమోదుపై బుధవారం అవగాహన కల్పించారు. వయోజనులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీసీడీఓ తనిఖీ

వంగర: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీఓ పి.మాలతి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల హాజరు, వారికి అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో డ్రైనేజీ నిర్మాణంపై స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎస్ఓ బి.రోహిణి, ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి

బాడంగి: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై ఆర్.జయంతి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో బుధవారం ఆమె మాట్లాడారు. తోటి విద్యార్థులతో మంచిగా నడచుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సోషల్‌మీడియా చాటింగ్‌లు, అపరిచితులు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లిదండ్రులకు చెప్పాలని, లేదంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీ

రామభద్రపురం: మండల కేంద్రంలో ఉన్న లాడ్జీలను ఎస్సై సురేంద్రనాయుడు, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. లాడ్జీలలో గదులను తీసుకున్నవారి వద్ద ఉన్న గుర్తింపు కార్డులను పరిశీలించి, వారు ఎక్కడ నుంచి వచ్చారో ఆరాతీశారు. అపరిచిత వ్యక్తులు, గుర్తింపు కార్డులు లేని వారికి లాడ్జీలోని గదులు ఇవ్వొద్దని యజమానులకు సూచించారు. అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

కులగణన సర్వే సక్రమంగా చేపట్టాలి



రామభద్రపురం:కులగణనపై శిక్షణ ఇస్తున్న రాజేశ్వరరావు

రాజాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామ సచివాలయం వద్ద సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కులగణనపై అవగాహన కల్పించారు. ఈ నెల 27 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. కులగణన ఏవిధంగా చేపట్టాలి, ఏయే వివరాలు సేకరించాలి, ఎలా నమోదు చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● వంగర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల నేతలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 నుంచి చేపట్టే ఈ సర్వేని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనీ, గరివిడి ఎంపీడీఓ జి.భాస్కరరావు కులగణనపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు, తహసీల్దార్ బూరాడ సుందరరావు, ఏఓ లోపింటి త్రినాథ్, ఈఓపీఆర్డీ గొబ్బూరు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● రామభద్రపురం: ఈ నెల 27 నుంచి చేపట్టే కులగణను పారదర్శకంగా చేపట్టాలని కులగణన శిక్షణ అధికారి డి.రాజేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు కులగణనపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన క్లస్టర్ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు వారి బయోమెట్రిక్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సులోచన రాణి, ఎంపీడీఓ రమామణి పాల్గొన్నారు.

పూజాద్రవ్యాల వేలం ఖరారు

రాజాం సిటీ: పట్టణంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయం వద్ద పూజాద్రవ్యాలు, చీరలు, కొబ్బరి చెక్కల కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ టి.శివకేశవరావు, ట్రస్టీ దుర్గారావు, గ్రామ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించగా.. ఏడాది కాలానికి గానూ రూ.4,36,500లకు పాట దక్కించుకున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. గతేడాది రూ.3,78,950లకు వేలం పాడగా.. ఈ ఏడాది రూ.57,550లు అదనంగా పాడారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 డిసెంబర్ 1 వరకు ఈ పాట వర్తిస్తుందని, అనంతరం 10 శాతం పెంపుతో ఇదే వ్యక్తి వేలంపాట పాడుకునే అవకాశం ఉంటుందన్నారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు


మెంటాడ: డిసెంబర్ 15 నుండి జనవరి 26 వరకు సుమారు 43 రోజులు పాటు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్లు నిండిన యువతతో పాటు పోటీల నిర్వహణకు వ్యాయామోపాధ్యాయులు, అధికారులు సిద్ధంగా ఉండాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. క్రీడా సంబరానికి సంబంధించి ఈ నెల 27 నుంచి గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌తో పాటు వెబ్‌సైట్‌ను కూడా ప్రభుత్వం రూపొందించిందన్నారు. పూర్తి వివరాలకు వలంటీర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, నాయకులు రాయిపిల్లి రామారావు, కనిమెరక త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ అజెండా..

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- కొండంపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం, రాత్రిబస



రాజాం: కొండంపేటలో రాత్రి బసలో నిద్రిస్తున్న ఎమ్మెల్యే జోగులు తదితరులు



రేగిడి: నాయిరాలవలసలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు

రాజాం: పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన అజెండా అని, ఈ నాలుగున్నరేళ్లు పేదల ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి సారించారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండంపేట సచివాలయం వద్ద అభివృద్ధి పనులు, సంక్షేమ నిధులకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో గుర్తుచేశారు. ఇప్పుడు అధికారం కోసం ఏవిధంగా మోసం చేయాలని చూస్తున్నారో వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రధాన రహదారి పక్కన పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో రాత్రిబస చేశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు ముద్దన సత్యారావు, సలాది తులసీరావు, తోట తిరుమలరావు, నల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాయిరాలవలసలో..

రేగిడి: మండలంలోని నాయిరాలవలస సచివాలయం వద్ద బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల డ్యాష్ బోర్డును వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు తెలియజేశారు. రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు ముఖ్యమంత్రిగా కావాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీఓ పాండ్రంకి రాములమ్మ, మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వావిలపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గురవాంలో..

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు ఎంపీడీఓ బాసూరీ శంకరరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధిలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, ఆల్తి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వంగర: రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు అన్నారు. కొప్పరవలస సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సాదెం లలితకుమారి, సాదెం శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులున్నారు.



రాజాంసిటీ : గురవాంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న రాజగోపాలనాయుడు, బండి నర్సింహులు తదితరులు



వంగర: కొప్పరవలసలో సంక్షేమ పథకాలు బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, కరణం సుదర్శనరావు

మహారాజ శ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IP 2/2023

Between:-

[illegible] .... పిటిషనరు

And: [illegible] .... రెస్పాండెంట్లు

[illegible] తే.27-11-2023ది [illegible] ఉ.గం.10.30లకు [illegible]

బొబ్బిలి
తేది: 22.11.2023

సం/- సి.సూర్యనారాయణ
(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

[illegible]